# పార్కింగ్ అస్తవ్యస్తం

- సీతమ్మధార రైతుబజార్ పరిసరాల్లో రోడ్డుపైనే వాహనాలు
- కానరాని ట్రాఫిక్ పోలీసులు
- కొనుగోలుదారులు, స్థానికులకు ఇబ్బందులు



సీతమ్మధార రైతుబజార్ సమీపంలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు





రైతుబజారు ఎదుట ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార : నగరంలోనే పెద్దదైన సీతమ్మధార రైతుబజార్ పరిసరాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. బజారుకు వచ్చే వాహనదారులు ఇష్టారాజ్యంగా రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు మార్గం ఇరుకుగా మారిపోతోంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నా, ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నా సంబంధిత పోలీసులు మాత్రం కనీస చర్యలు చేపట్టడం లేదు. సీతమ్మధారలో 1999లో రైతుబజార్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి బజార్‌లో రోజూ ఉదయం పూట 140 మంది రైతులు, సాయంత్రం 60 మంది కూరగాయలు విక్రయిస్తారు. రోజూ ఈ బజారులో సగటున ఐదు టన్నుల మేర కూరగాయలు విక్రయిస్తారు. ఇక్కడకు సీతమ్మధార, కేఆర్ఎం కాలనీ, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, మద్దిలపాలెం, భానునగర్, హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, పాత వెంకోజీపాలెం, పాత, కొత్త రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గురుద్వారా, శాంతినగర్, సీతంపేట తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది కూరగాయలు కొనుగోలు నిమిత్తం వస్తుంటారు. కానీ వారందరికీ పార్కింగ్ ప్రాంతం లేకపోవడంతో బజారుకి రెండు వైపులా రోడ్డు మీదనే వాహనాలు నిలిపేయాల్సిన పరిస్థితి నెలకొంది. బజారు బయట ఒకవైపు తోపుడు బండ్లు, మరోవైపు వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా పండగల సమయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ మార్గంలోనే 69వ నంబర్ సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ఇంకా ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం ఈ మార్గం రద్దీగా ఉంటుంది. అయినప్పటికీ ట్రాఫిక్ నియంత్రణకు ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు కనీస చర్యలు చేపట్టడం లేదు.



రోడ్డుపైనే ఆటోలు, ద్విచక్రవాహనాల పార్కింగ్

### అందరికీ తప్పని అవస్థలు

రైతుబజారు బయట దుకాణాలు, వాహనాల పార్కింగ్ కారణంగా ఈ రోడ్డులోనే గల ప్రభుత్వ వర్కింగ్ ఉమెన్ వసతిగృహానికి సిబ్బంది, ఉద్యోగినులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు బజారు లోపలికి వెళ్లేందుకు గల రెండు ప్రవేశద్వారాలకు అడ్డగా నేలపైనే దుకాణాలు, వాహనాల పార్కింగ్ ఆటంకంగా మారడంతో వినియోగదారులు బజారు లోపలికి, బయటకి రావడానికి అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు తరచూ బజారు తనిఖీ నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. ఆ సమయంలో డిప్యూటీ డైరెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చే వాహనాలు నిలపడానికి కూడా ఇక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఏదో మారుమూల వాహనం నిలిపిన తర్వాత అధికారులు బజారు లోపలికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుబజార్ సిబ్బంది, వ్యాపారులకు కూడా వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారిందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా సబ్సిడీపై టమాటా, ఉల్లి విక్రయాల సమయంలో వినియగదారుల సంఖ్య బాగా పెరుగుతోంది. ఆ సమయంలో వాహనాల పార్కింగ్ సమస్య వర్ణనాతీతం.

### తోపుడు బండ్ల వద్దే పార్కింగ్

రైతుబజారు బయట అధిక సంఖ్యలో తోపుడు బండ్ల ద్వారా పండ్లు, కూరగాయలు విక్రయిస్తున్నారు. పలు తోపుడుబండ్లు వినియోగంలో లేకున్నా జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. తోపుడు బండ్ల వద్దనే చాలా మంది వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌జామ్ సమయంలో హారన్ల మోతతో ఈ ప్రాంతం మార్మోగుతోందని స్థానికులు, పాదచారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

### పార్కింగ్ క్రమబద్ధీకరించాలి

సీతమ్మధార రైతుబజార్ వద్ద పార్కింగ్ ప్రదేశం లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బజారు బయట వినియోగంలో లేని తోపుడు బండ్లను వెంటనే టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు తొలగించాలి. ప్రభుత్వం స్పందించి బజారు బయట పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాసరావు, సీతమ్మధార

### హోంగార్డుని నియమించాలి

సీతమ్మధార రైతుబజార్ బయట నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ మార్గంలో వచ్చే 69వ నంబర్ సిటీ బస్సుల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతోంది. ఇక్కడ వాహనాల నియంత్రణకు ఎంవీపీ స్టేషన్ నుంచి కనీసం హోంగార్డుని నియమించేలా ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఉమామహేశ్వరరావు, బాలయ్యశాస్త్రి లే అవుట్

## ఏఎస్ఆర్‌నగర్‌లో అగ్నిప్రమాదం



బాధిత మహిళతో మాట్లాడుతున్న సిబ్బంది, నాయకులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఏఎస్ఆర్ నగర్ 281వ నంబరు సచివాలయం పరిధిలో ఓ ఇంట్లో ఆదివారం ఉదయం ఆకస్మికంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. ఇంట్లో సామగ్రితోపాటు విద్యుత్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గంకల కవిత, సచివాలయ సిబ్బంది బాధిత మహిళ వెంకటలక్ష్మిని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత మహిళకు కార్పొరేటర్ గంకల కవిత రూ.5 వేల నగదు అందించారు. వార్డు నాయకులు అప్పారావు, మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 46వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం పరిధి శాంతినగర్‌లో టీడీపీ సీనియర్ నాయకురాలు గొర్లె పార్వతి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి రూ.100ల సభ్యత్వ రుసుము వసూలు చేశారు. కార్యక్రమంలో నాయకులు లాలం అర్జున్, కిలపర్తి దేముడు, మైలపల్లి శ్రీను, నూకరాజు, కాశీ, ఆర్.చందు, వినయ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : సెంటర్ ఫర్ సైకాలజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ మ్యూజిక్ థెరపీ సంస్థ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించింది. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు అద్భుత గానంతో ఆహూతులను ఆకట్టుకున్నారు. త్యాగరాజు, అన్నమయ్య, దీక్షితార్ రచించిన కీర్తనలు ఆలపించారు. సంగీతంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం చేకూరుతుందని, పిల్లల్లో సంగీతం పట్ల ఆసక్తి పెంపొందించేలా కృషి చేస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

### ఉత్సాహంగా క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట : స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర వంటి పలు విషయాలపై ప్రశ్నలు సంధించారు. గెలుపొందిన బృందాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వై.వి.వి.సత్యనారాయణ, వై.ప్రదీప పాల్గొన్నారు.

### సత్యసాయి సేవా సంస్థల రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

ఎంవీపీకాలనీ: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శ్రీ సత్యసాయి సేవా సమితి, శ్రీసత్యసాయి నగర సేవా సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ప్రేమ సదన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. భారీ ఎత్తున నగరవాసులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. 34 మంది భక్తులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.నాయుడు, రోటరీ క్లబ్ చైర్మన్ కె.వి.శ్రీనివాస్, మాజీ చైర్మన్ జి.ఎస్.రాజు పాల్గొన్నారు.

### కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవ టీబీసీ పాయింట్ హిందీ భవన్ ఎదురుగా రోడ్డు పక్కన పార్వతమ్మ తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తుంటుంది. అదే ప్రాంతానికి చెందిన బెల్లాన కోటేశ్వరరావు(66), అతడి భార్య ఆదివారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లొచ్చి పళ్లు కొనేందుకు బండి వద్ద నిల్చున్నారు. అదే సమయంలో దుర్గాబజార్ వైపు నుంచి ఓ కారు అతివేగంతో వస్తూ పండ్ల బండిని బలంగా ఢీకొట్టింది. బండితోపాటు పండ్ల వ్యాపారి పార్వతమ్మ, కోటేశ్వరరావు, అతని భార్యను కూడా ఢీకొనడంతో వారంతా రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో వెంటనే వైద్య సిబ్బంది చేరుకొని ముగ్గురినీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య, పండ్ల వ్యాపారి పార్వతమ్మ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కారును స్టేషన్‌కు తరలించి డ్రైవ్‌చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడు కోటేశ్వరరావు జీవీఎంసీ రిటైర్డ్ డీఈ. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

## అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా ఎస్ఐ శ్రీను హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఎస్ఐ శ్రీను మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి షాపుల వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

- సమాజంలో అల్లర్లు సృష్టించకుండా కుటుంబాలతో ప్రశాంతంగా జీవించాలని ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రోజువారీ విధానాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న బాలచెన్నయ్య

మురళీనగర్ : సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు సభ్యులు సహకరించాలని 'మా' వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్నూరి బాలచెన్నయ్య కోరారు. అసోసియేషన్ ద్వితీయ సర్వసభ్య సమావేశం వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సామాజిక సేవా కార్యక్రమాలకు రూ.లక్షకు పైగా ఖర్చు చేశామన్నారు. పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌కు రూ.15వేలు విలువైన వస్తువులు, చినముషిడివాడలోని బాలబాలికల సంరక్షణ కేంద్రానికి రూ.10వేలు, మా వాకర్స్ సభ్యుడి ఆరోగ్య సంరక్షణకు రూ.15వేలు, విద్యార్థి చదువు కోసం రూ.50వేలు, వాకర్స్ పార్కులో మొక్కలకు రూ.4వేలు, హరితపార్కులో పచ్చదనం పెంపులో భాగంగా మొక్కలు నాటేందుకు రూ.8వేలు ఖర్చు చేశామన్నారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బీటీ స్వామి, పి.సతీష్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, పి.చంద్రమౌళి, ఎంవీఎస్ మూర్తి, జి.రమణ, పి.అప్పలనాయుడు, ఎస్.ప్రకాశరావు, సీహెచ్ ప్రసాద్, ఎం.మోహన్‌కుమార్, డి.సతీష్ కుమార్, టీవీ రమణ పాల్గొన్నారు.

## 'ధార'కు వెళ్లే భక్తులకు టోల్ కష్టాలు


స్థానికులకు ఉచిత ప్రవేశం కల్పించాలని డిమాండ్



టోల్‌గేట్ వద్ద వాహనదారులు, సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు సింహాచలం దేవస్థానం అనుబంధ దేవాలయమైన మాధవధార మాధవస్వామి జలధారకు ప్రత్యేక విశిష్టత ఉంది. 365 రోజులూ ఇక్కడకు వచ్చే భక్తులు ధారలో స్నానమాచరించేందుకు ప్రాధాన్యమిస్తారు. ముఖ్యంగా కార్తీకమాసం మొదలు మాఘమాసం వరకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందులోనూ అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు ఎక్కువగా వస్తుంటారు. అయితే ఆలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన టోల్‌గేటు వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గేటు నుంచి ఆలయానికి అర కిలోమీటరు దూరం ఉండడంతో అందరూ వాహనాలపై వెళ్లేందుకు ప్రాధాన్యమిస్తారు. అయితే బైకు, ఆటోకి రూ.10, కారుకి 20, మినీ బస్‌కి రూ.50 చొప్పున టోల్ వసూలు చేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మాధవధార ప్రాంతంలో ఉండే స్థానికులు, మాలధారులు నిత్యం ఇక్కడి మాధవస్వామి, వేణుగోపాల స్వామి, శివాలయాలకు వస్తుంటారు. వీరంతా తమకు టోల్ ఫీజు వసూలు నుంచి మినహాయింపునివ్వాలని కోరుతున్నారు. టోల్ డబ్బులు కడితేనే లోపలికి వాహనంతో అనుమతిస్తామని, లేకపోతే వాహనాన్ని గేటు బయట వదిలి వెళ్లాల్సిందేనంటూ అక్కడి సిబ్బంది మొండిగా వ్యవహరిస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. లోపల కనీసం పార్కింగ్ సదుపాయం కూడా లేదని, రోడ్డు పక్కనే పెట్టే వాహనాలకు డబ్బులు ఎందుకు చెల్లించాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో వాహనాలు జారిపడిపోయి మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. మరోవైపు జలధార వద్ద నాచు ఉండడంతో స్నానాలు చేసేటప్పుడు జారిపోతున్నామని, మహిళలకు స్నానపు గదులు కూడా లేవని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింహాచలం దేవస్థానం కనీసం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని, స్థానిక భక్తులకు టోల్ వసూలు నుంచి మినహాయింపునివ్వాలని కోరుతున్నారు. జలధార వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

## టీఎస్సార్ షెల్టర్‌కు విజయనగరం జిల్లా వాసి



టీఎస్ఆర్ షెల్టర్‌లో సోమినాయుడు

సీతమ్మధార: విజయనగరం జిల్లా గుర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సోమినాయుడు (60) విశాఖ రైల్వేన్యూ కాలనీలో ఉంటున్న కుమార్తె వద్దకు వచ్చాడు. శస్త్రచికిత్స చేయించుకున్న సోమినాయుడు అల్లుడు, కుమార్తె దగ్గర వచ్చినప్పటికీ వారికి తాను భారమైపోయానని భావిస్తూ ఆదివారం బయటికి వచ్చేశాడు. అతను రైల్వేస్టేషన్‌లో ఉండగా ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుల్ మీసాల అప్పలనాయుడు సోమినాయుడిని టీఎస్సార్ షెల్టర్‌కు అప్పగించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, నందూరి శ్రీనివాస్ తదితరులు అతనికి ఆశ్రయం కల్పించారు.

## మహిళలకు చీరలు పంపిణీ

మురళీనగర్ : కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు మురళీనగర్‌లో ఆదివారం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలయాలను దర్శించుకున్న మహిళా భక్తులకు చీర, జాకెట్, చిన్న పిల్లలకు గాజులు ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ అందించారు.

## శిష్టకరణాలు ఐక్యంగా ఉండాలి

మర్రిపాలెం : సమాజంలో రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న శిష్టకరణాలు ఐక్యంగా ముందుకు సాగాలని శిష్టకరణం అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పోలుమహంతి ఉమా మహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మాధవధార మామిడితోటల్లో ఆదివారం కంచరపాలెం శిష్టకరణం అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపరంగా శిష్టకరణాలు కొంత ముందంజలో ఉన్నప్పటికీ రాజకీయంగా, ఆర్థికంగా తగిన ప్రాధాన్యత లేకపోవడం శోచనీయమన్నారు. 2009లో స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి బీసీ డీ జాబితాలో చేర్చినప్పటికీ కేంద్రంలో మాత్రం ఇంతవరకు ఓబీసీ జాబితాలో చేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అందరి సహకారంతో పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఎస్ మూర్తి పట్నాయక్, బలివాడ హరిబాబు, పి.రామకృష్ణ, నూకరాజు, 33వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిస కావద్దు






విజేతలకు కప్ అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: యువత మత్త పదార్థాలకు బానిస కాకూడదని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హితవు పలికారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరిలోవలో రెండు వారాలుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను ముఖ్య అతిథి సీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు తరఫున కంచర్ల అచ్యుతరావు అందిస్తున్న సేవలను కొనియాడారు. క్రీడలను ఆయన ప్రోత్సహిస్తూ యువతకు సహకరించడం అభినందనీమన్నారు. నేటి యువత ఎక్కువగా గంజాయి, మద్యపానానికి బానిసలై మానసిక రోగులుగా మారుతున్నారన్నారు. వారి వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ట్రస్టు వ్యవస్థాపకుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ తన పెద్ద కుమారుడు యశ్వంత్ జయంతి సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. విన్నర్‌కు రూ 1.20 లక్షలు, రెండో స్థానం వారికి రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీలు అందించినట్లు చెప్పారు.

## వేమన మందిరంలో రెడ్డి వివాహ పరిచయ వేదిక



మాట్లాడుతున్న వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వివేకానందరెడ్డి

సీతమ్మధార: ఆశీలమెట్టలో గల వేమన మందిరంలో రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద త్తున విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, ఈస్టు గోదావరి జిల్లాల నుంచి రెడ్డి కుటుంబాలు పాల్గొన్నాయి. వధువు, వరుడు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు ఈ సందర్భంగా సేకరించుకున్నారు. వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఉచిత రెడ్డి వివాహ పరిచయ వేదిక నిరంతర సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, కోశాధికారి ఎస్.బాలిరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు నీలాపు రమణారెడ్డి, పులగం సూర్యనారాయణరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాళీమాతకు ప్రత్యేక పూజలు



న్యూ కాలనీలో రైల్వే న్యూకాలనీ వర్తక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాళీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## పీడీ లేకుండానే ఆటలు..!

ఎన్ఎంసీహెచ్ విద్యార్థులకు అవస్థలు



మైదానంలో పీడీ లేకుండా ఆడుకుంటున్న విద్యార్థులు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధిలో అతి పెద్ద ఉన్నత పాఠశాలల్లో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ఒకటి. స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల ఈ పాఠశాలలో ప్రస్తుతం ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 918 మంది హైస్కూల్ విద్యార్థులు, 57 మంది ఇంటర్ విద్యార్థులున్నారు. ఇంత పెద్ద పాఠశాలలో ఒక్క ఫిజికల్ డైరెక్టర్ కూడా లేకపోవడంతో విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యం వెలుగులోకి రావడం లేదు. వాస్తవానికి ఇక్కడ ఇద్దరు పీడీలు ఉండాలి. గతంలో ఇక్కడ ఉండే ఒక పీడీ ఏడాది కిందట బదిలీపై వెళ్లిపోయారు. దీంతో విద్యార్థులు ఇక్కడి మైదానంలో తమకు నచ్చిన ఆటలు ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా విద్యార్థులు ఏవైనా క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు గెలుచుకుంటే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి అవకాశం విద్యార్థులకు దక్కకుండా గతంలో జీవీఎంసీ, ఇప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పీడీ పోస్టులు భర్తీ చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మైదానం విశాలంగా ఉన్నా క్రీడా సామగ్రి మచ్చుకైనా కనిపించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### రికార్డు అసిస్టెంట్ కూడా లేరు...

నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్ కూడా లేరు. టీసీల జారీ, విద్యార్థుల హాజరు నమోదు, అడ్మిషన్ల రిజిస్టర్ల నిర్వహణ వంటి విధులను రికార్డు అసిస్టెంట్ నిర్వహించాల్సి ఉంది. అయితే ఇక్కడ నాలుగు సంవత్సరాలుగా రికార్డు అసిస్టెంట్ లేరు. ప్రస్తుతం బయాలజీ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడే రికార్డు అసిస్టెంట్ విధులు కూడా నిర్వహించాల్సి రావడం గమనార్హం. గతంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తి జ్ఞానాపురంలో గల జోనల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఆ పోస్టు ఖాళీగానే ఉండిపోయింది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్, రెండు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–5లోని ఆల్ మదీనా మసీద్‌లో ఆదివారం మిలాద్(గ్యార్వీ షరీఫ్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముంబైకు చెందిన బోధకుడి ఆధ్వర్యంలో ముస్లింలంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీద్ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు జాఫర్ అబ్బాస్ రహీ, కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ జాఫర్, మౌలానా ముఫ్తీ ఖయ్యూమ్, మీర్ అబ్బాస్ హుస్సేన్, మాజీ ఆర్డీవో ఖాన్, యూత్ ప్రెసిడెంట్ మదీనా, ఇతర మసీదులకు చెందిన ఇమామ్‌లు పాల్గొన్నారు.